నమస్తే తెలంగాణ
# జగిత్యాల
5 | కరీంనగర్, సోమవారం 12 ఫిబ్రవరి 2024 | JAGTIAL

# సభను సక్సెస్ చేయాలి

- బీఆర్ఎస్ శ్రేణులు తరలివెళ్లాలి
- మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

గంగాధర, ఫిబ్రవరి 11: నల్లగొండలో ఈ నెల 13న నిర్వహించనున్న బహిరంగ సభకు బీఆర్ఎస్ శ్రేణులు భారీగా తరలివెళ్లి విజయవంతం చేయాలని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కాంగ్రెస్ సర్కారు కేఆర్ఎంబీకీ శ్రీశైలం, నాగర్జునసాగర్ ప్రాజెక్టులను అప్పగించడాన్ని నిరసిస్తూ కేసీఆర్ ఆధ్వర్యంలో ఈ సభను నిర్వహిస్తున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వాకంతో నల్లగొండ, రంగారెడ్డి, పాలమూరు జిల్లాలు ఏడారిగా మారే ప్రమాదమున్నదని పేర్కొన్నారు. కేసీఆర్ ప్రభుత్వం పదేండ్లుగా కాపాడిన ప్రాజెక్టులను రేవంత్ సర్కారు ఏర్పాటైన రెండు నెలలకే కేంద్రంచేతిలో పెట్టడం బాధాకరమన్నారు. ఇలాంటి కృష్ణా జలాల కోసం మరోపోరాటానికి సిద్ధం కావాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. నల్లగొండ సభను అడ్డుకునేందుకు కాంగ్రెస్ కుటిల యత్నాలు చేస్తున్నదని, ఆరు నూరైనా సభ జరిగి తీరుతుందని స్పష్టం చేశారు.



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మేయర్ సునీల్‌రావు

# నల్లగొండ సభకు తరలివెళ్లాలి

ఎమ్మెల్యే గంగుల కమలాకర్ • బీఆర్ఎస్ నేతలతో సన్నాహక సమావేశం

కార్పొరేషన్, ఫిబ్రవరి 11: నల్లగొండలో ఈనెల 13న నిర్వహించనున్న బీఆర్ఎస్ సభకు నియోజకవర్గం నుంచి శ్రేణులు తరలివెళ్లాలని మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పిలుపునిచ్చారు. ఆదివారం కరీంనగర్‌లోని తన నివాసంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లోనే కృష్ణా నదిపై నిర్మించిన ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగించిందని మండిపడ్డారు. కాంగ్రెస్ వైఖరిని ఎండగట్టేందుకే తెలంగాణ తొలి ముఖ్యమంత్రి నేతృత్వంలో ఈ సభను నిర్వహిస్తున్నామని చెప్పారు. నియోజకవర్గం నుంచి రెండు వేల మందిని తరలించేందుకు నాయకులు ఏర్పాట్లు చేయాలన్నారు. సమావేశంలో నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు, కొత్తపల్లి మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, ఎంపీపీ లక్ష్మయ్య, నాయకులు శ్యాం సుందర్‌రెడ్డి, పొన్నం అనిల్, జమీలోద్దీన్, సాబీర్‌పాషా, బండారి వేణు, అయిలేందర్ పాల్గొన్నారు.

## కొలువుల కోసం కుస్తీ



కొలువుల కల సాకారం చేసుకునేందుకు యువత పుస్తకాలతో కుస్తీ పడుతున్నది. కొద్ది రోజుల నుంచి విరామం లేకుండా సన్నద్ధమవుతున్నది. అయితే, తాము అధికారంలోకి వచ్చిన వెంటనే జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని, ఫిబ్రవరి 2న తొలి నోటిఫికేషన్ వేస్తామని ఎన్నికల ముందు కాంగ్రెస్ హామీలిచ్చినా.. ఇప్పటి వరకు ఎలాంటి నోటిఫికేషన్ రాకపోవడంతో నిరుత్సాహపడుతున్నది. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి త్వరలోనే నోటిఫికేషన్ ఇస్తామని చెప్పగా.. వేయి కండ్లతో ఆశగా ఎదురుచూస్తున్నది. కరీంనగర్ లైబ్రరీలో వందలాది మంది అభ్యర్థులు ఇలా ప్రిపేర్ అవుతుండగా, 'నమస్తే' తన కెమెరాలో బంధించింది. - కరీంనగర్, స్టాఫ్ ఫొటోగ్రాఫర్





# ‘గృహజ్యోతి’లో గందరగోళం

- పూర్తిస్థాయిలో ఆన్‌లైన్‌కానీ ప్రజాపాలన దరఖాస్తులు
- డేటా లేక విద్యుత్ అధికారులు, సిబ్బంది తంటాలు
- క్షేత్రస్థాయిలో ముందుకుసాగని ప్రక్రియ • ఆలస్యంగా మేల్కొన్న అధికారులు • మొబైల్ ఫోన్లలో అర్జీలను ఆన్‌లైన్ చేస్తున్న సిబ్బంది

ముకరంపుర, ఫిబ్రవరి 11: ప్రభుత్వం ఆరు గ్యారెంటీల్లో భాగంగా ఆర్భాటంగా ప్రకటించిన గృహజ్యోతి అమల్లో గందర నెలకొన్నది. ప్రజాపాలన దరఖాస్తులను పూర్తిస్థాయిలో ఆన్‌లైన్ చేయకపోవడంతో డేటా లేక యంత్రాంగం తంటాలు పడుతున్నది. సిబ్బంది స్పాట్ బిల్లింగ్ మిషన్ల ద్వారా వివరాల సేకరణకు ఆటంకం కలుగుతున్నది. ఇప్పటికే దరఖాస్తుల్లో మీటర్ నంబర్, బిల్లు వివరాలు ఇచ్చిన వినియోగదారులు, మళ్లీ ఆధార్ కార్డు, కరెంట్ బిల్లు, రేషన్‌కార్డు ఇవ్వాలని అడుగుతుండడంతో ఆగమైతున్నారు. ఇటు సిబ్బంది, అటు అధికారులు ఏం చేస్తున్నారో తెలియక పరేషాన్ అవుతున్నారు. అయితే ఆలస్యంగా మేల్కొన్న యంత్రాంగం మొబైల్‌ఫోన్లలో మళ్లీ అర్జీలను నమోదు చేస్తున్నది.

### సమస్య ఏమిటి..?

గృహజ్యోతి అమలుకు విద్యుత్ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి బిల్లింగ్ యంత్రాల్లో దరఖాస్తుదారుల మీటరు కనెక్షన్ నంబర్, రేషన్, ఆధార్, యజమాని సెల్ నెంబరు నమోదు చేయాల్సి ఉన్నది. ఇందుకు అధికారులు బిల్లింగ్ యంత్రాలను అప్‌డేట్ చేసి, ప్రజాపాలన దరఖాస్తుల వివరాలను వీటికి అనుసంధానించారు. అయితే అర్జీల్లోని సమాచారం ఆన్‌లైన్‌లో లేకపోవడంతో ఈ ప్రక్రియ ముందుకు సాగడం లేదు.

### హడావిడిగా దరఖాస్తుల ఆన్‌లైన్

అధికారులు ఆలస్యంగా తప్పు తెలుసుకున్నారు. ప్రజాపాలన దరఖాస్తులు ఆన్‌లైన్ చేయకపోవడంతో సమస్య తలెత్తుందని గుర్తించారు. ఆగమేఘాల మీద మొబైల్‌ఫోన్లలో ఆన్‌లైన్ చేస్తున్నారు. ఇందుకు రాత్రింబవళ్లు సిబ్బంది శ్రమిస్తున్నారు. విలువైన సమాచారాన్ని గోప్యంగా ఉంచాల్సిన అధికారులు జనసంచారం ఉండేచోటే చేస్తుండడంతో విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి పకడ్బందీగా ఆన్‌లైన్ ప్రక్రియ చేపట్టాలని కోరుతున్నారు.

### అర్హులెవరూ..వర్తించేదెవరికీ..

గృహజ్యోతి పథకానికి అర్హుల గుర్తింపు ప్రక్రియపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో 200 యూనిట్లు విద్యుత్ వినియోగించే వారందరికీ ఫ్రీ కరెంట్ ఇస్తామని వాగ్దానం చేసింది. కానీ ఇప్పుడు అందరికీ కాదు అర్హులకే అంటూ మెలిక పెడుతున్నది. వినియోగదారులు ఎంత కరెంట్ వాడుతున్నారో అనే సమాచారం ఇప్పటికే ప్రభుత్వం వద్ద ఉన్నది. వాళ్లు నెలనెలా కడుతున్న బిల్లులను పరిగణలోకి తీసుకుంటే తెలిసిపోతుంది. అయినా ఇప్పుడు మళ్లీ దరఖాస్తులు తీసుకోవడం, తర్వాత మళ్లీ ఇంటింటికీ వివరాలు సేకరిస్తుండడంపై పలువురు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. ఏదో సాకు చూపుతూ అసలుకే మోసం చేస్తుందేమోనని అనుకుంటున్నారు. ఎందుకంటే ఇటీవల ప్రవేశపెట్టిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లోనూ పూర్తిస్థాయిలో నిధులు కేటాయించకపోవడమే నిదర్శనమని చెబుతున్నారు.

# వరికి మొగి పురుగు



లార్వా దశలో మొగి పురుగు



రెక్కలు వచ్చిన తర్వాత..

# రైతన్నకు దిగులు

- ఉధృతంగా వ్యాపిస్తున్న తెగులు
- గత సీజన్‌లోనూ విజృంభన.. దిగుబడిపై ప్రభావం
- అన్నదాతల్లో ఆందోళన
- క్షేత్ర స్థాయిలో పర్యటిస్తున్న అధికారులు
- నివారణ చర్యలపై సలహాలు సూచనలు



వీణవంక మండలంలో ఓ రైతు పొలంలో దిగి పరిశీలిస్తున్న కేవీకే సైంటిస్ట్ శ్రీనివాస్ తదితరులు

**యాసంగి వరిలో మొగి పురుగు ఉధృతంగా వ్యాపిస్తున్నది. ముఖ్యంగా డిసెంబర్‌లో నాట్లు వేసిన పొలాలపై ప్రభావం చూపుతున్నది మరో పక్క జింక్ లోపం, సల్ఫైడ్ దుష్ప్రభావం కూడా కనిపిస్తున్నది. ఫలితంగా పొలాలను వదిలేసే పరిస్థితి వస్తున్నది. గత యాసంగి, వానకాలం సీజన్లలోనూ ఇలానే ప్రభావం పడి దిగుబడులు తగ్గగా.. ఈ సారి అలాంటి పరిస్థితే కనిపిస్తున్నదని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే అప్రమత్తమైన వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు, క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ.. అన్నదాతలను అప్రమత్తం చేస్తున్నారు. నివారణ చర్యలపై అవగాహన కల్పిస్తున్నారు.**



కుళ్లిన వరి వేరు..

కరీంనగర్, ఫిబ్రవరి 11(నమస్తే తెలంగాణ)/ జగిత్యాలటౌన్ : ఉమ్మడి జిల్లాలో ఇప్పటికే చాలాచోట్ల వరి నాట్లు పూర్తి చేశారు. కాలువల ఆధారిత సాగు ప్రాంతాల్లో నవంబర్, డిసెంబర్ నెలల్లోనే వేశారు. అయితే బోర్లు, చెరువులు, బావులపై ఆధారపడి సాగు చేసే రైతులు జనవరిలో నాట్లేశారు. అయితే యాసంగి ప్రారంభంలోనే మొగి పురుగు ఉధృతిని గుర్తించిన వ్యవసాయ అధికారులు, కేవీకే, ఏరువాక, పొలాస వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు క్షేత్ర స్థాయిలో పర్యటిస్తున్నారు. కరీంనగర్ డీఏవో ప్రియదర్శినితో పాటు అధికారులు గ్రామాల్లో పర్యటించి పరిస్థితిని పరిశీలిస్తున్నారు. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్, జమ్మికుంట, వీణవంక, ఇల్లందకుంట, శంకరపట్నం, మానకొండూర్ మండలాల్లో సీడ్ వరి ఉత్పత్తి చేస్తుండగా, హుజూరాబాద్ నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లోని ఈ పురుగు ప్రభావం ఎక్కువగా ఉన్నట్టు గుర్తించారు. ఇటు గంగాధర, రామడుగు, తిమ్మాపూర్, గన్నేరువరం మండలాల్లోనూ నిర్ధారించారు. ఇలానే ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పరిశీలిస్తూ.. రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. మొగి పురుగు నివారణకు సూచనలు చేస్తూ.. తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తున్నారు. ఈ సారి మొగిపురుగు ప్రభావంతోపాటు జింక్ లోపం, సల్ఫైడ్ ప్రభావం కూడా కనిపిస్తున్నట్టు పొలాస శాస్త్రవేత్త డాక్టర్ ఎం బలరాం, కేవీకే శాస్త్ర వేత్త శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

### ఇవీ లక్షణాలు



మొగి పురుగు ఆశించిన వరిపైరు

ఆలస్యంగా లేదా నారు ముదిరిన తర్వాత నాట్లు వేయడం, సాధారణంగా రాత్రి ఉష్ణోగ్రతలు తక్కువగా నమోదు కావడం, సూర్యరశ్మి రోజుకు 7 గంటల కంటే తక్కువగా ఉండడం, నత్రజని తక్కువగా వాడడం, కాండం బలహీనం కావడం లాంటి కారణాలతో మొగి పురుగు వ్యాప్తిస్తున్నది. నారు మడిలో ఆశిస్తే మొక్కల పిలకలు ఎండి చనిపోతాయి. ప్రారంభం నుంచి చిరుపొట్ట దశలో ఆశిస్తే ఈనిన తర్వాత తెల్ల కంకులు బయటకు వస్తాయి. నాట్లు వేసిన పది పన్నెండు రోజుల్లో ఆశిస్తే.. పొలాలు మాడి పోతాయి. పురుగు లార్వా దశలో ఉన్నపుడే కాండం తొలుస్తూ పంటకు ఎక్కువ నష్టం చేస్తుంది. రెక్కలు వచ్చిన తర్వాత తన సంతానాన్ని ఉధృతం చేసేందుకు చుట్టు పక్కల వరి పంటను ఆశిస్తుంది. దీనికి తోడు జింక్ లోపం, సల్ఫైడ్ దుష్ప్రభావంతోనూ వరికి నష్టం వాటిల్లుతున్నది. రైతులు పంట మార్పిడి పాటించకపోవడం, ప్రతి సీజన్‌లో వరినే సాగు చేయడం వల్ల ఈ లోపాలు ఏర్పడుతున్నట్లు వ్యవసాయ శాస్త్ర వేత్తలు చెబుతున్నారు.

### సల్ఫైడ్ దుష్ప్రభావం



సల్ఫైడ్ దుష్ప్రభావంకు గురైన వరి పంట

సల్ఫైడ్ దుష్ప్రభావంతో వరి నేలల్లో, పంట మధ్య కాలంలో అక్కడక్కడ బాగా పెరిగిన పంట మొత్తం పసుపు వర్ణంలోకి మారిపోవడం, మడి బాగా మెత్తగా ఉండి కాలు చాలా లోతుగా దిగబడి పోతుంది. పొలంలో నడుస్తుంటే బుడగల రూపంలో గాలి బయటకు వస్తుంది. నేల నుంచి దుర్గంధం వాసన, మొక్కను వేర్లతో బయటకు తీసినప్పుడు కుళ్లిన కోడిగుడ్ల వాసన వస్తుంది. పంట వేర్లు పూర్తిగా నల్లబడి జీవం లేక కుళ్లిన వాసన వస్తుంది. మొక్కలు పూర్తిగా చనిపోయే ప్రమాదముంటుంది. అధిక నీటి ముంపు ఉండడం, తగిన రీతిలో పంట వేర్లకు గాలి అందక పోవడం, నేలలో రసాయన చర్యల వల్ల లభ్య ఇనుము మార్పు చెందక పోవడం, చాలా కాలంగా బరువు నేలల్లో సల్ఫర్ (గంధకం) కలిగిన 20-20-0-15, 20-20-0-13 లాంటి కాంప్లెక్స్ ఎరువులు అధికంగా వాడడం కారణంగా ఈ పరిస్థితి ఏర్పడుతుంది. ఈ నేపథ్యంలో మొక్క వేర్లకు తగిన గాలి తగిలేలా, మురుగు నీటిని తీసి మళ్లీ నీరు అందివ్వాలి. పైరు వేయడానికి మడిని తయారు చేసే ముందు మట్టిన బాగా కలియబెట్టి ఆరబెట్టాలి. భూమిని ఎత్తు చేసి ఒకటిరెండు బండ్ల ఎర్రమట్టిని వేయాలి. పంట మధ్య కాలంలో పొలాన్ని సన్న నెర్రెలు వచ్చే వరకు ఆరగట్టి అప్పుడప్పుడు మళ్లీ నీరివ్వాలి. ఈ చర్యలతో క్రమంగా సల్ఫైడ్ దుష్ప్రభావం తగ్గుతుంది. అమ్మోనియం, సల్ఫేట్ వంటి ఎరువులను ఇలాంటి పొలాల్లో వాడకూడదు.

### నివారణ చర్యలు

ప్రస్తుతం చాలాచోట్ల వరి పొలాలు పిలక దశలో ఉన్నాయి. ఈ సమయంలో మొగి పురుగు ఉధృతిని నివారించేందుకు ప్రతి ఎకరాకూ 3 లింగాకర్షక బుట్టలను ఏర్పాటు చేసుకోవాలి. అందులో వారానికి బుట్టకు 25-30 పురుగులు పడినప్పుడు తప్పని సరిగా సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. ఈ దశలో ఎకరాకు కార్బోప్యూరాన్ 3జీ గుళికలు 10 కిలోలు లేదంటే కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 4జీ గుళికలు 8 కిలోలు, లేదంటే క్లోరాన్ట్రోనిలిప్రోలు 4జీ గుళికలు 4 కిలోలు 20 నుంచి 25 కిలోల ఇసుకలో కలిపి బురద పదనులో వేసుకోవాలి. మొగి పురుగు నివారణకు సిఫారసు చేయబడని ఏ ఇతర 10జీ లేదా సేంద్రియ గుళికలు (గంట గోళీలు) యూరియాతో కలిపి వేయడం వల్ల ఎలాంటి ఉపయోగం లేదని రైతులు గమనించాలి. ఒక వేళ వరి పంట చిరుపొట్ట దశలో రెక్కల పురుగు ఉధృతిని గమనిస్తే కార్టాప్ హైడ్రోక్లోరైడ్, 50 శాతం ఎస్పీ 2 గ్రాములు, (ఎకరాకు 400 మిల్లీ లీటర్లు ) లేదంటే క్లోరాన్ట్రోనిలిప్రోలు 0.3 మిల్లీ గ్రాములు (ఎకరాకు 60 మిల్లీ లీటర్లు) లేదంటే ఐసోసైక్లోసిరం 0.6 మిల్లీ లీటర్లు (ఎకరాకు 120 మిల్లీ లీటర్లు) ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

### జింక్ లోపం ఉంటే..

జింకు ధాతులోపంతో పొలాలు పాలిపోతున్నట్టు గుర్తించిన అధికారులు, నివారణ చర్యలను వివరిస్తున్నారు. ప్రతి యాసంగి సీజన్‌లో రైతులు ఆఖరి దమ్ములో ఎకరాకు 20 కిలోల జింక్ సల్ఫేట్ వేసుకోవాలని సూచిస్తున్నారు. ప్రత్యామ్నాయంగా 10 కిలోల జింక్ సల్ఫేట్‌ను 200-250 కిలోల మాగిన పశువుల పేడ లేదంటే వర్మీ కంపోస్టు కలిపి 20 నుంచి 30 రోజుల పాటు గోనె సంచిలో ఉంచి మగ్గిన తర్వాత చివరి దుక్కిలో వేయాలని చెబుతున్నారు. పైరుపై జింక్ లోపం కనిపిస్తే లీటరు నీటికి 2 గ్రాముల జింకు సల్ఫేట్‌ను కలిపి 5 రోజుల వ్యవధిలో రెండు మూడు సార్లు పిచికారీ చేసుకోవాలని, జింక్ సల్ఫేట్ ద్రావణంలో పురుగులు, తెగుళ్ల నివారణ మందులు కలుపవద్దని, చౌడు నేలల్లో పిచికారీ తప్పని సరిగా చేసుకోవాలని సూచిస్తున్నారు.

### నివారణ చర్యలు చేపట్టాం



మొగి పురుగు ఉధృతిని గుర్తించాం. నివారణపై మా అధికారులు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. పురుగు దాని ప్రభావం ఏమేరకు ఉన్నదో గుర్తించి తగిన సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచిస్తున్నాం. మాతో పాటు జమ్మికుంట కృషి విజ్ఞాన కేంద్రం, ఏరువాక కేంద్రం శాస్త్ర వేత్తలు కూడా క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. జింక్ ధాతులోప నివారణ చర్యలు కూడా తీసుకుంటున్నాం. సల్ఫైడ్ దుష్ప్రభావం కూడా కనిపిస్తున్నది. రైతులకు అన్ని విషయాల్లో తగిన సూచనలు, సలహాలు అందిస్తున్నాం. ఇలాంటి సమస్యలు ఎదుర్కొంటున్న రైతులు మా అధికారులకు సమాచారం ఇస్తే పరిశీలించి తీసుకోవాల్సిన చర్యలను వివరిస్తారు.

\- ప్రియదర్శిని, డీఏవో (కరీంనగర్)

# స్నేహితుడి కుటుంబానికి అండగా..

జగిత్యాల, ఫిబ్రవరి 11 : చిన్ననాటి నుంచి తనతో కలిసి తిరిగిన మిత్రుడు అకాలంగా మరణించడంతో చలించిపోయాడు. నిరుపేద కుటుంబం కావడంతో వారికి అండగా నిలిచాడు. ఏకంగా రూ.5 లక్షల సాయం చేసి భరోసా కల్పించాడు. పూర్తి వివరాలిలా ఉన్నాయి.. జగిత్యాల జిల్లా కేంద్రంలోని అన్నపూర్ణ థియేటర్ సమీపంలో భీష్మానగర్‌కు చెందిన కొండ్ర సాగర్ ఇటీవల వాగు నీటిలో ప్రమాదవశాత్తు పడి మృతి చెందాడు. మిత్రుడి మృతి విషయం తెలుసుకున్న విదేశాల్లో స్థిరపడిన బింగి నరేశ్ చలించిపోయాడు. సాగర్ మృతిని జీర్ణించుకోలేకపోయాడు. స్నేహితుడిది పేద కుటుంబం కావడంతో వారికి అండగా నిలవాలనుకోవడంతోపాటు రూ.5 లక్షల ఆర్థిక సాయం అందించాడు. సాగర్ కూతురు దక్షిత పేరు మీద రూ.2.20 లక్షలు ఫిక్సడ్ డిపాజిట్ చేయించి, స్థానికంగా ఉన్న నరేశ్ భార్య మౌనిక ద్వారా కుటుంబ సభ్యులకు అందించారు. అంతే కాకుండా, సాగర్ అంత్యక్రియల ఖర్చులకు రూ.60 వేలు, ఇతర ఖర్చులకు రూ.2.20 లక్షలు అందించారు. మిత్రుడి కుటుంబానికి ఆర్థిక సాయం చేసిన బింగి నరేశ్-మౌనిక దంపతులను పట్టణానికి చెందిన ఆరుమల్ల హరి, సూరజ్ శివశంకర్, తొపారపు రవి, ఆరుమళ్ళ నారాయణ, తప్ప లక్ష్మీనారాయణ, సిరికొండ గంగరాజం అభినందించారు.

# 45 మంది ఎంపీడీవోల బదిలీ

- ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ట్రాన్స్‌ఫర్లు
- ఇతర జిల్లాలకు అలాట్ చేసిన సర్కారు
- నేడు రిలీవ్ కావాలని ఆదేశాలు
- 13న జిల్లాలో జాయినింగ్ రిపోర్ట్
- మండలాలకు పోస్టింగ్‌లు ఇవ్వనున్న కలెక్టర్లు

కరీంనగర్, ఫిబ్రవరి 11 (నమస్తే తెలంగాణ) : ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలో 45 మంది ఎంపీడీవోలను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈ బదిలీలు జరిగాయి. మూడేళ్లు ఒకే చోట, నాలుగేళ్లు సొంత జిల్లాలో పనిచేసిన వారికి బదిలీలయ్యాయి. ఉమ్మడి జిల్లా పరిధిలోని కరీంనగర్‌లో 12, జగిత్యాలలో 15, పెద్దపల్లిలో 9, రాజన్న సిరిసిల్ల జిల్లాలో 9 మంది చొప్పున మొత్తం 45 మందికి బదిలీ జరిగింది. కాగా, ఇందులో ఎక్కువ మందిని ఉమ్మడి జిల్లా పరిధిలోనే సర్దుబాటు చేశారు. ఇతర జిల్లాల నుంచి ఉమ్మడి జిల్లాకు మరో ఆరుగురిని బదిలీ చేశారు. బదిలీ అయిన ఎంపీడీవోలను సంబంధిత కలెక్టర్లు సోమవారం రిలీవ్ చేయాలని, బదిలీపై వెళ్లిన జిల్లాల్లో ఈ నెల 13న రిపోర్ట్ చేయాలని ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. ఆ తర్వాత సంబంధిత కలెక్టర్లు ఎంపీడీవోలకు మండలాలను కేటాయిస్తు ఉత్తర్వులు ఇవ్వనున్నారు. బదిలీ అయిన వారి వివరాలు ఇలా ఉన్నాయి.

- కరీంనగర్ జిల్లాకు చెందిన ఎంపీడీఓలలో అడ్డబోయిన శ్రీనివాస్‌రెడ్డి, సీ రవీందర్‌రెడ్డి, రావూరి పద్మావతి, ఆవునూరి స్వాతి, ఇనుకొండ స్వరూప, వేముల విజయలక్ష్మి జగిత్యాలకు, ఎస్ రాజీవ్ మల్హోత్ర రాజన్న సిరిసిల్ల జిల్లాకు, తొడుపునూరి జయశీల జయశంకర్ భూపాలపల్లికి, యాదగిరి భాస్కర్‌రావు, నీలగిరి దివ్యదర్శన్‌రావు, కొప్పుల శ్రీనివాస్ పెద్దపల్లికి, గుమ్మడి కల్పనను వరంగల్ జిల్లాకు బదిలీ చేశారు.
- జగిత్యాల జిల్లాలో సీహెచ్ శ్రీనివాస్, వెంకటేశ్‌జాదవ్, జీ సంతోష్‌కుమార్‌ను నిజామాబాద్‌కు, జే పుల్లయ్య, ఎస్ రాజేశ్వరి ఏ సంజీవరావు, కే భీమేశ్, కే ప్రభును కరీంనగర్ జిల్లాకు, ఎస్ జనార్దన్ సిద్దిపేటకు, ఏ పద్మజ, జీ తిరుపతి, బీ శైలజారాణి, ఐ ప్రవీణ్‌కుమార్ పెద్దపల్లికి, కే నవీన్‌కుమార్‌ను యాదాద్రి భువనగిరికి, ఏ రాజేందర్‌ను రాజన్న సిరిసిల్ల జిల్లాకు బదిలీ చేశారు.
- పెద్దపల్లి జిల్లాకు చెందిన ఎంపీడీవోలలో బీ యాదగిరి, టీ విజయకుమార్, ఆర్ వేణుగోపాల్‌రావును కరీంనగర్‌కు, జీ సత్తయ్య, బీ శ్రీనివాసమూర్తి, బీ జయశీల, కే శ్రీనివాస్, వై శశికళను రాజన్న సిరిసిల్లకు, ఎం రాజును ములుగుకు బదిలీ చేశారు.
- రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన ఎంపీడీవోల్లో ఎం శంకర్, పీ రవీందర్, ఎస్ రాంరెడ్డి, ఎన్ రాజేందర్‌రెడ్డి, ఎం శ్రీనివాస్, నీర్ల రమాదేవీ, పీ లచ్చులు, బీ చిరంజీవి, ఓదెల రామకృష్ణను జగిత్యాల జిల్లాకు బదిలీ చేశారు..
- ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు ఇతర జిల్లాల నుంచి ఆరుగురు ఎంపీడీఓలను బదిలీ చేశారు. ఇందులో కరీంనగర్ జిల్లాకు హన్మకొండ నుంచి టీ సునిత, సిద్దిపేట నుంచి బీ మధుసూదన్, ఎం శ్రీధర్, దమ్మని రాము, సిరిసిల్ల జిల్లాకు సిద్దిపేట నుంచి వీ భాస్కర శర్మ, పెద్దపల్లి జిల్లాకు సిద్దిపేట నుంచి జీ శ్రీనివాస్ గౌడ్‌ను బదిలీ చేశారు.



క్యాబేజీ తోటలో వెంకటేశ్

సాగుచేస్తున్న కూరగాయల పంటలు

సాగుచేస్తున్న కాలీప్లవర్ తోట

# ఎనిమిదెకరాలు.. తీరొక్క సాగు

- తక్కువ పెట్టుబడితో కూరగాయల పంటలు
- ఆదర్శంగా నిలుస్తున్న పెంబట్ల యువరైతు

సారంగాపూర్, ఫిబ్రవరి 11 : తక్కువ పెట్టుబడితో వివిధ రకాల కూరగాయలను సాగుచేస్తూ ఎక్కువ ఆదాయం పొందుతూ ఆదర్శంగా నిలుస్తున్నాడు సారంగాపూర్ మండలం పెంబట్ల గ్రామానికి చెందిన యువ రైతు బండారి వెంకటేశ్. 9 ఏండ్లుగా తనకున్న 8 ఎకరాల్లో సీజనల్‌గా వివిధ రకాల కూరగాయలు సాగు చేస్తున్నాడు. కూరలిసంద, క్యాబేజీ, కాలీఫ్లవర్, కాకర, సోర, బీర, స్వీట్‌కార్న్, చిక్కుడు, బటానీ, వంకాయ, నువ్వు పంటలు సాగుచేస్తున్నాడు. ప్రస్తుతం 10 గుంటల్లో కూరలిసంద, 5 గుంటల్లో కాలిఫ్లవర్, 10 గుంటల్లో వంకాయ, 20 గుంటల్లో బెండకాయ, అంతరపంట కింద కశ్మీర్ రెడ్ ఆపిల్ బేర్, రెండెకరాల్లో కరబూజ సాగు చేశాడు. ఏటా సీజన్‌కు అనుగుణంగా రసాయన ఎరువులు వాడకుండా డ్రిప్ పద్ధతిలో సాగు చేస్తున్నాడు.

### కూరగాయలతో అధిక లాభం

ఎప్పుడూ ఒకే రకమైనవి కాకుండా వివిధ రకాల కూరగాయల సాగు చేస్తే మంచి ఆదాయం వస్తుంది. నాకున్న ఎనిమిదెకరాల్లో కొంత భూమి ఖాళీగా ఉంచుతూ మిగతా భూమిలో విడుతల వారీగా వివిధ రకాల పంటలు సాగుచేస్తున్నా. పండించిన కూరగాయలను జగిత్యాలతోపాటు వివిధ ప్రాంతాల్లో విక్రయిస్తున్నా. కష్టపడి పనిచేస్తున్నందుకు ఫలితం దక్కుతున్నది. ఆసక్తి ఉన్న రైతులు నా భూమిని సందర్శిస్తే తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు వచ్చే వివిధ పంటల సాగుపై అవగాహన కల్పిస్తా.

